# ఎములాడలో నేడే సద్దులు

- ముస్తాబవుతున్న మూలవాగు
- సాయంత్రం ఆడిపాడనున్న మహిళాలోకం
- అన్ని ఏర్పాట్లూ చేస్తున్న యంత్రాంగం

వేములవాడ టౌన్, అక్టోబర్ 19 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు వేములవాడ మూలవాగు ముస్తాబవుతున్నది. వేములవాలో ఏడురోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుండగా, ఇందుకు గాను మూలవాగును విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. బతుకమ్మ తెప్పవద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ సంవత్సరం ₹22 లక్షలతో పట్టణం నుంచి మూలవాగు వద్దకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. విద్యుత్ దీపాలు, మంచినీటి సరఫరా, బారీకేడింగ్, స్టేజీ అలంకరణ, మూలవాగుకు వచ్చే దారుల్లో మొరంపోయించడం, అన్ని ముఖ్యకూడళ్లలో హైమాస్ట్ లైట్లు, మూలవాగు వద్ద విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు.

# బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్

- ఈనెల 21 వరకు దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్ల, అక్టోబర్ 19 : సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ (ఉపాధ్యాయ ఉద్యోగాల) అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను నిర్వహించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21లోగా రాజన్న బీసీ స్టడీ సర్కిల్‌లో నేరుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ లేదా టీటీసీ, కులం, ఆదాయం, ఆధార్, టెట్ అర్హుల పరీక్ష జాబితా, డీఎస్సీ దరఖాస్తు ఫారం జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా వచ్చి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. లేదా బీసీ స్టడీ సర్కిల్ పోర్టల్ tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరింత సమాచారం కోసం 08723-223004, 9381888743నంబర్లకు, లేదా కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని జెల్ల వెంకటస్వామి కోరారు.

# పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి



సిరిసిల్లలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబర్ 19: పోలింగ్ రోజు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన పనులపై సెక్టార్ అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. అప్పుడే సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు, ఇతర ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేయగలుగుతారని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో పోలింగ్ డే రోజు కేంద్రాల్లో నిర్వహించాల్సిన విధులపై సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, నోడల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డెమో ఓటింగ్ మిషన్ల ద్వారా పోలింగ్ రోజు చేయాల్సిన విధులు, డాక్యుమెంటేషన్‌పై కలెక్టర్, మాస్టర్ ట్రైనర్లు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు మాక్ పోలింగ్ అయిందో లేదో పరిశీలించడం, మాక్ పోలింగ్‌లో నమోదైన ఓటర్లను క్లియర్ చేయడం, పోలింగ్‌ను ప్రారంభించడం, ప్రతీ రెండు గంటలకోసారి ఓటింగ్ శాతాన్ని తెలుపడం, పోలింగ్ ప్రారంభానికి ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ పూర్తయిన ఈవీఎంలకు సీల్ వేయడం, సంబంధిత పత్రాలు పూరించడం తదితర అంశాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. ఎన్నికల మార్గదర్శకాలు, పోలింగ్ విధులపై ప్రతి అధికారి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఎన్నికల పోలింగ్ సజావుగా పూర్తయ్యేలా మానిటరింగ్ చేయగలుగుతారన్నారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే సరైన రీతిలో పోలింగ్ అధికారులను గైడ్ చేస్తూ పరిష్కారం చూపుతారన్నారు. శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, శిక్షణా పర్యవేక్షకులు పిబి.శ్రీనివాసచారి, డీఆర్డీవో నక్క శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారమే

- సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటితో కలిసి విలేకరుల సమావేశం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, అక్టోబర్ 19: పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే వారిచ్చే ఆరు గ్యారెంటీలేమో కానీ రాష్ట్రంలో అంధకారం అలుముకోవడం ఖాయమని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, వృద్ధులు, దివ్యాంగ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. అరవై ఏండ్లు పాలించిన ఆ పార్టీ ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, కరెంట్ లాంటి కనీస వసతులు కల్పించలేదని విరుచుకుపడ్డారు. ఇప్పుడు మళ్లీ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అలవికానీ హామీలను ఇస్తున్నదని మండిపడ్డారు. బూటకపు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. ఖని చౌరస్తాలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం మంత్రి..పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకానీ, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో..పోతుందో తెలియని దుస్థితి ఉండేదన్నారు. అనేక మంది రైతులు రాత్రి కరెంట్‌కు బలయ్యారని ఆవేదనవ్యక్తం చేశారు. కానీ బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో అభివృద్ధి శరవేగంగా సాగిందన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రం పురగోమిస్తున్నదని చెప్పారు. కార్మిక, రైతు, గ్రామీణ పేదలకు విద్య, వైద్యం, సంక్షేమ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించామన్నారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి దీమా పేరుతో రూ. 5 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. మళ్లీ గెలిస్తే తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తామని. పింఛన్లను పెంచుతామని స్పష్టం చేశారు. అలాగే ఎకరాకు ₹16 వేల చొప్పున రైతుబంధు అందిస్తామని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యరక్ష పేరిట ₹15 లక్షలకు పెంచనున్నామన్నారు. వీటితోపాటు సౌభాగ్యలక్ష్మి ద్వారా పేద మహిళలకు 3వేల జీవన భృతి అందజేస్తామన్నారు. ₹400కే వంట గ్యాస్ ఇస్తామని చెప్పారు. సమావేశంలో నగర మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, నాయకులు మూల విజయారెడ్డి, కెంగర్ల మల్లయ్య, గంగ్ర దామోదర్ , కార్పొరేటర్లు రాజ్‌కుమర్, కృష్ణవేణి, కుమ్మరి శ్రీను, నాయకులు పీటీ స్వామి, మాదాసు రాంమ్మూర్తి, శంకర్ గౌడ్, మారుతి, తానిపర్తి గోపాల్ రావు, జేవీ రాజు, బొడ్డు రవీందర్, అచ్చ వేణు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే స్వర్ణయుగమే

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే తెలంగాణలో రాబోయేది స్వర్ణ యుగమే. శిశువుకు తల్లి ఒడి రక్ష.. రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష. కేసీఆర్ పద్నాలుగేండ్ల ఏండ్ల పోరాటం, నిరంతర మేధోమథనం, నిత్య పరిశీలనతో రూపొందించిన సంక్షేమ పథకాల అమలుతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు దేశానికి దిక్సూచిగా మారాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల వేళ అన్నివర్గాలకూ మేలు చేసే పథకాలతో మ్యానిఫెస్టోను ప్రకటించారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపిస్తే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎవరూ మద్దతు పలుకలేదు. ప్రధాని మోదీ రామగుండానికి వచ్చిన సందర్భంలో బొగ్గు బ్లాకులను ప్రైవేటు చేయబోమని చెప్పి మాట తప్పారు. సబ్బండ వర్ణాలు బాగుండాలంటే బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- బోర్లకుంట వెంకటేశ్‌నేతకాని, పెద్దపల్లి ఎంపీ**

### బీఆర్‌ఎస్ గెలిస్తేనే సింగరేణికి మనుగడ

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గెలిస్తేనే సింగరేణి మనుగడ సాధ్యం. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పర్యటనలో కేసీఆర్‌పై నీలాపనిందలు వేయడం బాధాకరం. కాంగ్రెస్ పాలనలో లోపాయికారి ఒప్పందాలతో నిబంధనలకు విరుద్ధంగా తమ అనుయాయులకే బొగ్గు బ్లాకులను కేటాయించింది. నాటి మంత్రి దాసరి నారాయణరావే ప్రత్యక్ష సాక్షి. ఇప్పుడు సింగరేణిని ప్రైవేట్ పరం చేయడానికి మేము కారణం కాదు. బీజేపీ, బీఆర్‌ఎస్‌పైనే నెపం వేస్తూ తప్పించుకో జూస్తున్నది. సింగరేణి గనుల ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్న కాంగ్రెస్, బీజేపీని చిత్తుగా ఓడించాలి.

**- కోరుకంటి చందర్,**
**రామగుండం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి**

# బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల వణుకు

- పథకాలను చూసే పార్టీకి ఆదరణ
- పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి
- గులాబీ పార్టీలోకి 200 మంది కాంగ్రెస్ నేతలు
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 19: సబ్బండ వర్గాలు మెచ్చేలా రూపొందించిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను చూసి ప్రతిపక్షాలు వణికిపోతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మెచ్చి ఇతర పార్టీలు బీఆర్‌ఎస్‌వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు మూకుమ్మడిగా గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ లబ్ధిదారులు కనిపిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆరే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రగతి, పథకాలు కొనసాగాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటేయాలని పిలుపునిచ్చారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే నిండా మునగడం ఖాయని హెచ్చరించారు. చేరిన వారిలో మామిడి కుమార్, మిట్టపల్లి శ్రీకాంత్, గాండ్ల అనిల్, డీ శ్రీకాంత్, రాపెల్లి రాజు, పిడుగు అజయ్, అశోక్, మాటూరి రాజేశ్వరి, సుద్దాల శంకరమ్మ, సుశీల, అరికిల్ల రజిత, పుల్లూరి పద్మ, ఇరుగురాల కొమురమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారి స్రవంతి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, సర్పంచ్ చీకటి స్వరూపాపోచాలు, ఉప సర్పంచ్ బోండ్ల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు మొల్మూరి విజయారావు, రాపెల్లి శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, భూమేశ్, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే రాగినేడుకు చెందని కాంగ్రెస్ సీనియర్ నేత బుర్ర అంజయ్యగౌడ్ అనుచరులు కాదాసి దుర్గయ్య, కాల్వ రాజయ్య, కట్ల కనుకయ్య, కాదాసి సదయ్య, పద్మయ్య తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక్కడ సర్పంచ్ మల్కారేవతి కుమారస్వామి, నాయకులు మల్కామధుకర్, మల్లయ్య, మొగిలి, శంకర్ పాల్గొన్నారు.

# కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం

- పార్టీ బలోపేతానికి కృషిచేయాలి
- బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- పార్టీలో ముదిరాజ్ సంఘం నేతల చేరిక

మంథని, అక్టోబర్ 19: పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తామని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ భరోసా ఇచ్చారు. కొత్తపాత అనే తేడా లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సైనికుల్లా పనిచేసి మంథని గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మల్హర్ మండలం తాడిచర్లకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు కారుపాకల శంకర్, ఆకుల నారాయణ, బువనగిరి శంకర్, ఆకుల విజయ్‌కుమార్, ఆకుల నారాయణ, కరుపాకల ఓదెలు, పిట్టల రాజయ్య, సుంకరి చంద్రయ్య, గోసుకుల సమ్మయ్య, నోతి శ్రీనివాస్‌తో పాటు మరో 20 మంది, మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీకే) గ్రామానికి చెందిన సుమారు 20 మంది వివిధ పార్టీల నేతలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేశారు. వీరికి మంథనిలోని రాజగృహాలో పుట్ట మధు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆనంతరం మాట్లాడుతూ యావత్ దేశంలోనే ఎక్కడాలేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటామని పేర్కొన్నారు.